# బ్రోచేవారెవరురా?



## పాలకూర సీతాలత

పినాకపాణి తల్లివైపు చూశాడు. ఆమె ఆదమరిచి నిద్రపోతోంది. మంచంమీంచి లేచివెళ్లి ముఖం కడుక్కున్నాడు. కుంపటి అంటించి నీళ్లు పడేశాడు. మధ్యలో ఒకసారి వచ్చి తల్లి లేచిందేమోఅని చూశాడు. రాత్రి సరిగ్గా నిద్రపట్టలేదు కాబోలు, ఇంకా నిద్రపోతూనే వుంది ఆమె. కాఫీ తయారుచేసి గ్లాసుతో తీసుకెళ్లి తల్లిని తట్టిలేపాడు.

"అమ్మా !... కొంచెం కాఫీ తాగు... లేకపోతే మరీ నీరసంగా వుంటుంది..."అన్నాడు. ఆమె నీరసంగా కళ్లు తెరిచింది. నెమ్మదిగా లేచి కూర్చుంది. గ్లాసును ఆమె నోటి ముందు వుంచాడు పినాకపాణి. ఆమె మెల్లగా గుటకలు వేస్తూ కాఫీ తాగింది.

"వేడినీళ్లు పెడతాను. నెమ్మదిగా లేచి ముఖం కడుక్కో... ఆ తర్వాత రొట్టె కాల్చి ఇస్తాను... తిను..." అన్నాడు పినాకపాణి.

"వద్దురా... నాకు సహించదు..." అంది అనంతమ్మ తల అడ్డంగా తిప్పుతూ.

"అలా అంటే ఎలా ? ఎలాగోలా తినాలి.. లేకపోతే నీరసంరాదూ ?..." అన్నాడు.

ఆమె మాట్లాడలేదు. వేడినీళ్లు కాచి ఇచ్చాకా ముఖం కడుక్కుంది.

అనంతమ్మ భర్త పది సంవత్సరాల క్రితం ఏదో ప్రమాదంలో మరణించాడు. ఆమెకు ఇద్దరు కొడుకులు. గుమాస్తాగా పనిచేసిన భర్త ఏమీ వదలలేదు. పెద్దవాడు సుబుద్ధి ఇప్పుడు ఏదో పల్లెటూర్లో ప్రైమరీ స్కూల్ టీచర్‌గా వున్నాడు. ఆ పల్లెలో హైస్కూలు చదువు లేదన్న మిషతో తల్లినీ, తమ్ముడినీ అక్కడే వదిలాడు. సుబుద్ధి పేరుకు తగ్గట్టుగానే వుండేవాడు పెళ్లి కాకముందు. కొత్తగా వచ్చిన పెళ్లాం అతన్ని లొంగిదీసుకున్నందువల్ల కొంచెం మారిపోయి, తల్లికి డబ్బులు పంపడంలో కొంచెం ఆలస్యం చేస్తున్నాడు. అందువల్ల ఇంట్లోని చిన్న, చితక సామాను కాళ్ళువచ్చి బైటకు పోతున్నాయి. ఇంటి పనుల్లో రోగిష్టి తల్లికి సాయంచేస్తూ హైస్కూల్లో కష్టపడి చదువుకుంటున్నాడు పినాకపాణి.

ఈ మధ్య అనంతమ్మ ఆరోగ్యం మరింత పాడయ్యింది. ఆమెకు మరీ బాగోనప్పుడు స్కూలు మానేస్తాడు పినాకపాణి. అందుకు తల్లి అంగీకరించదు. నిజమేమరి ! తన కొడుకు శ్రద్ధగా చదువుకుని మంచి ఉద్యోగం చెయ్యాలని ప్రతి తల్లీ కోరుకుంటుంది.

"ఒకటి రెండు రోజులు నేను స్కూలుకి వెళ్లకపోయినా ఫర్వాలేదమ్మా ! స్నేహితుల దగ్గర్నుంచి నోట్సులు తెచ్చుకుంటాను. నా చదువు ఏ రకంగానూ పాడవ్వదు. నువ్వు విపరీతమైన జ్వరంతో మూలుగుతూ ఇక్కడ కూర్చుంటే నాకు స్కూలుకు వెళ్లాలని వుండదు. ముందు నువ్వు... ఆ తర్వాతే చదువు ..." అనేవాడు పినాకపాణి.

దగ్గుతూ, గాజుకళ్లతో అతనివైపు ప్రేమగా చూసేది అనంతమ్మ.

తల్లిగురించి అంతగా ఆరాటపడే కొడుకు వుండటం ఒకరకంగా, ఆ తల్లి చేసుకున్న అదృష్టమే.

ఆమెకు వాదించేటందుకు కూడా ఓపిక వుండదు.

"ఊ..." అని దీర్ఘంగా నిట్టూర్చి పడుకుంటుంది.

ఆ ఊరి డాక్టరు విశ్వేశ్వరరావు మొహమాటంకొద్దీ వచ్చి వైద్యం చేస్తూ వుంటాడు. అందుకు కారణం అనంతమ్మ భర్త, ఆయన తండ్రి స్నేహితులు కావడం. అక్కడికీ ఒకటి రెండుసార్లు పినాకపాణి ముందు మూలుగుతాడు.

"ఒరేయ్ ! యాభై రూపాయలు ఇవ్వాలిరా ఇప్పటివరకూ..."

పినాకపాణి తల్లికి తెలియకుండా అన్నకు ఉత్తరం రాశాడు, డబ్బు పంపమని. ఎన్ని రోజులైనా జవాబు మాత్రం రాలేదు. 'బహుశ

**ఆటోమాటిక్ రిస్ట్‌వాచ్**

ధర రు. 30/– మాత్రమే

21 జువల్స్ ఆటోమాటిక్ వాచ్ చెయిన్ సెట్టువంతోనూ, 7 సం.ల గ్యారంటీతోనూ రు. 30/– లకే లభించును.

పోస్టేజి, ప్యాకింగ్ ఛార్జీలు రు. 9–95 లు అదనం.

**DEEPAK TRADING Co., (A-4)**
P. O. LALBIGHA, (NAWADAH).

### గమనిక

వ్యక్తులపేర మీ రచనలు పంపితే వాటి పరిశీలనలో ఆలస్యం జరిగే ప్రమాదాలెక్కువ కనుక మీ రచనలన్నీ కూడా శీర్షిక పేరు కవరుపైన లేదా కార్డుపైన ఉదహరిస్తూ సంపాదకుడు, ఆంధ్ర సచిత్ర వారపత్రిక, గాంధీనగరం, విజయవాడ – 520 003 అన్న చిరునామాకి పంపండి.

—సం.

*డా॥ వి. వి. కె. రావ్, B.A.*

వైద్య విద్వాన్, వైద్యాచార్య, సెక్స్ స్పెషలిస్ట్

వివాహము వాయిదా వేయ నవసరం లేదు. హస్త ప్రయోగం, నరముల బలహీనత, శీఘ్రస్కలనములకు ఆయుర్వేద చికిత్స. పోస్టుద్వారా చికిత్స కలదు.



**రావూస్ క్లినిక్**
టి. బి. రోడ్, తెనాలి.

ఫోన్ : 3700 & 4010.

**ఫొటోగ్రఫీ కలర్ ఫొటోగ్రఫీ**

మరియు స్క్రీన్ ప్రింటింగ్

మీ ఉజ్వల భవిష్యత్‌కై పైమూడు కళలను పూర్తి సాంకేతిక విజ్ఞానాన్ని ఇంటివద్దనుంచే ఇంగ్లీషు లేదా హిందీ లేదాతమిళంలో నేర్చుకొనండి. ప్రాస్పెక్టసు కోరువారు వ్రాయండి.

**KALAIMATHI NILAYAM**
Nanjai thalaiyur
P O. 639 204. Tamilnadu.

కొన్ని బెణుకులు మలుపులు తిరుగుతాయి...



అన్ని బెణుకులను జిందా బామ్‌తో నాట్యం చేయించి పంపివేయండి




**జిందా బామ్**

మీ ఒంటి నొప్పులు, బెణుకులు, వాపులు అన్నిటినీ నివారించేది, ఎదురులేనిది.

## బ్రోచేవారెవరురా?

అన్నయ్యకు ఉత్తరం అందలేదు కాబోలు...' అనుకున్నాడు. కానీ ఆ ఉత్తరం అందుకుని దాన్ని చించి ముక్కలు చేశాడని వాడికేం తెలుసు ?

సుబుద్ధి వేలకువేలు సంపాదిస్తున్నాడనీ, పెద్ద ఆఫీసరు పోస్టులో ఉన్నాడనీ అనటంలేదు కానీ సంపాదన ఎంత తక్కువైనా కన్నతల్లినీ, తమ్ముడినీ మరిచిపోతే ఎలా ? ఉన్నదాన్లోనే సర్దుకుని తన వాళ్లను సుఖపెట్టడానికి ప్రయత్నించాలి కానీ 'నేను, నా పెళ్లాం సుఖపడితే చాలు...' అనుకుంటే ఎలాగ ? తండ్రి తద్దినం మాత్రం ఘనంగా జరుపుతాడు. అది తన బాధ్యత అని చెప్తాడు. బ్రతికి ఉన్న తల్లి తిందో, లేదో చూడనివాడు చచ్చిన తండ్రికి మాత్రం తద్దినాలు పెడతాడు.

స్కూల్లో పరుగు పందెంలో పినాకపాణికి పాతిక రూపాయలు బహుమతి వచ్చింది. ఇంటికి వచ్చి తల్లితో తను పందెంలో ఓడిపోయానని చెప్పాడు. ఆ పాతిక రూపాయిలూ విశ్వేశ్వరరావు చేతిలో పెట్టాడు.

"ప్రస్తుతం ఇది వుంచండి. తర్వాత సంగతి తర్వాత చూద్దాం. నేను ఈ డబ్బు మీకు ఇచ్చినట్లు అమ్మకు చెప్పకండి...', అన్నాడు పినాకపాణి.

విశ్వేశ్వరరావు అభ్యంతరం చెప్పకుండా తక్కున జేబులో పెట్టుకున్నాడు ఆ సొమ్ము.

పినాకపాణి కొంచెం కొంచెంగా పరిస్థితులు అర్థం చేసుకుంటున్నాడు. వాడికి తల్లి అంటే అమితమైన ప్రేమ. తనకు చేతనైనంతవరకూ ఆమె ఏ కష్టం కలగకుండా చూసుకోవాలని నిర్ణయించుకున్నాడు. అందుకోసం అవసరం అయితే తన చదువు త్యాగం చేసుకుందుకుకూడా సిద్ధం అయ్యాడు. తల్లిని అనురాగంతో చూసుకోగలడు గానీ ఇల్లు నడపడానికి డబ్బు ఎలా తెస్తాడు ? ఇంట్లో సామాను కొద్ది కొద్దిగా మాయం కావడం, అన్నగారు ఈసారి రెండు నెలలు దాటినా డబ్బు పంపకపోవడం గమనించాడు. కానీ ఏం చెయ్యాలో తెలియటం లేదు. పైగా ఈ మధ్య తల్లికి అసలు ఒంట్లో బాగోటంలేదు.

అనంతమ్మ ముఖం కడుక్కోవడం పూర్తి చేసి నెమ్మదిగా నడుస్తూ వెళ్లి మంచం ఎక్కేసింది. అప్పటికే పెనంమీద బ్రెడ్‌ముక్కలు కాల్చి తల్లికోసం చూస్తూవున్న పినాకపాణి తల్లికి అందించేడు బ్రెడ్. ఆమె రెండుముక్కలు తిని ఇక తినలేనని అంటే బలవంతంగా మరో రెండు ముక్కలు తినిపించాడు. ఆ తర్వాత ఆమె ఒంటిమీద చెయ్యివేసి "ఈ రోజు జ్వరం తగ్గినట్లే వుంది. డాక్టరుగారు వచ్చి చూశాక అన్నం వండుతాను..." అన్నాడు పినాకపాణి.

"స్కూలుకు... వెళ్లావా ?" అడిగింది అనంతమ్మ.

వెళ్లనట్టు అడ్డంగా తల తిప్పాడు

''వద్దు... నువ్వు స్కూలుకు వెళ్లు...'' అంది తల్లి.

మాట్లాడలేదు పినాకపాణి.

''కొంచెం అన్నం వండి, నువ్వు తిని వెళ్లు... డాక్టరు వచ్చి అన్నం తినమంటే... నెమ్మదిగా లేచి నేను పెట్టుకుని... తింటాను. అన్నం వద్దంటే ... బ్రెడ్... తింటాను...'' అంది.

అన్నం వండి తను కొంచెం తిన్నాడు.

తల్లికోసం కంచం, గ్లాసు, చారు అన్నీ సిద్ధంగా పెట్టాడు, ఆమె ఎక్కువ కష్టపడకుండా.

డొక్కు సైకిలు ఎక్కి స్కూలుకి వెళ్లిపోయాడు.

స్కూలుకు వెళ్లాడన్న మాటేగానీ ఆలోచనలన్నీ తల్లి చుట్టూనే వున్నాయి.

డాక్టరు వచ్చాడో లేదో! తల్లి అన్నం తిన్నదో, లేదో...

స్కూలు అయిపోగానే తనని అభిమానించే శంకరం మాష్టారి దగ్గరకు వెళ్లాడు పినాకపాణి.

''మాష్టారూ ! మీతో కొంచెం మాట్లాడాలి...''

ఇంటికి బయలుదేరిన మాష్టారు, ''పద... నడుస్తూ మాట్లాడుకుందాం...'' అన్నారు.

సైకిల్ నడిపించుకుంటూ మాష్టారితో పాటే నడవసాగాడు.

''చెప్పరా...'' అన్నారు శంకరం మాష్టారు.

''మాష్టారూ!... నాకు పార్ట్ టైం ఉద్యోగం కావాలి...'' అన్నాడు.

ఆశ్చర్యంగా వాడివంక చూశారు శంకరం మాష్టారు. పదహారేళ్ల కుర్రవాడిలో కలిగిన ఆ ఆలోచనకు కొంచెం బాధ కల్గింది ఆయనకు. లేమి మనుష్యులను ఎంత లొంగదీస్తుంది ?

''పాణి...'' అన్నారు కొంచెం బాధగా.

''తప్పదు మాష్టారూ !... ఇంటి పరిస్థితి అలా వుంది. చదువు మానడానికి అమ్మ ఒప్పుకోదు కనుక ఇలా అడిగాను. లేకపోతే ఏ హోటల్లోనో సర్వర్‌గా చేరడానికూడా నేను సిద్ధం సార్...'' అన్నాడు.

''వద్దురా... నేను మీ అన్నయ్యకు ఉత్తరం రాస్తాను...'' అన్నారు ఆయన.

''వద్దుసార్... నేను అందరితోనూ వాడి గురించి చెప్పానని వాడు నన్ను కోపగిస్తాడు...''

నడుస్తున్న మాష్టారు ఆగిపోయారు. పర్సులోంచి యాభై రూపాయలు తీశారు.

''ఉంచు...'' అన్నారు పినాకపాణి చేతిలో పెడుతూ.

''వద్దు సార్... మిమ్మల్ని అప్పు అడగటం నా ఉద్దేశ్యం కాదు...''

''తెలుసు... నీ అభిమానం నేను ఎరుగుదును... ప్రస్తుతం ఇది వుంచు... మీ అన్నయ్య డబ్బు పంపగానే నాకు బాకీ తీర్చుదువుగాని...'' బలవంతంగా చేతిలో పెట్టారు.

తప్పదన్నట్లు జేబులో పెట్టుకున్నాడు డబ్బు.

''సార్... ఈ సైకిలు వుంచుకోండి సార్...'' అన్నాడు.

''అంటే ?... యాభై రూపాయలకు ఈ సైకిల్ నా దగ్గిర తాకట్టు పెడుతున్నావా ?'' సన్నగా నవ్వారు ఆయన.

''అదీ... అదీ...'' ఏదో చెప్పబోయాడు పినాకపాణి.

''అక్కర్లేదు... నేను అర్థం చేసుకున్నాను. ఏ పరిస్థితులలోనూ ఈ సైకిలు నీనుంచి దూరం చేసుకోకు. స్కూలుకీ, మీ ఇంటికీ మధ్య దూరం అయిదు కిలోమీటర్లు. సైకిలు దూరం చేసుకుని రోజుకి పది కిలోమీటర్లు నడుస్తావా ? చదువుకుంటూ, తల్లికి సేవలు చేస్తూ, ఇంత దూరం నడిస్తే నీ ఆరోగ్యం ఏం కాను ? నా దగ్గరేకాదు... వేరే ఎక్కడాకూడా సైకిలు అమ్మే ప్రయత్నంగానీ, తాకట్టుపెట్టే ప్రయత్నంగానీ చెయ్యకు. ఏదైనా కష్టం ఎస్తే నాతో చెప్పు...'' మందలించారు శంకరం మాష్టారు.

''మాష్టారూ ! మీరు నిజంగా దేముడు సార్...'' అన్నాడు పినాకపాణి కృతజ్ఞతగా.

''సరే... నాకు మార్కెట్‌లో పనివుంది. నువ్వు ఇంటికి వెళ్తావా ?'' అడిగేరు జంక్షన్‌లో ఆగి మాష్టారు.

''అవును. ఒకసారి డాక్టర్‌గారి దగ్గరకు వెళ్లి ఆయన ఉదయం అమ్మను చూడ్డానికి వచ్చారో లేదో తెలుసుకుంటాను. వెళ్లివుండకపోతే ఆయన్నికూడా తీసుకుని వెళ్తాను. వస్తాను సార్... నమస్కారం...'' అంటూ ముందుకు నడిచాడు పినాకపాణి.

వెళ్లిపోతున్న పినాకపాణి వంక ఆప్యాయంగా చూశారు మాష్టారు.

వాడి వయసు ఎంత ? వాడి ఆలోచనలు ఎంత ఎత్తులో ఉన్నాయి ? తల్లి తప్ప తనకు ప్రపంచంలో ఎవ్వరూ లేరన్నట్లు ప్రవర్తించే వాడికి సాయం చేసేది ఎవరు ? వాడిని ఆదుకునేది ఎవరు ?

'బ్రోచేవారెవరురా ?' అనుకున్నారు మాష్టారు.

* * *

ఒక వారం రోజులు గడిచిపోయాయి.

సుబుద్ధి దగ్గర్నుంచి ఎంతో కాదుకదా కనీసం ఉత్తరంకూడా రాలేదు.

అత్యవసరమైన ఖర్చులు మాత్రమే చేసినా ఆ యాభైలో పినాకపాణి దగ్గర ముప్ఫై రెండు రూపాయలు మిగిలాయి.

ఆ రోజు అనంతమ్మకు మళ్లీ తీవ్రంగా జ్వరం వచ్చింది. వచ్చి పరీక్షచేశాడు విశ్వేశ్వరరావు.


''ఒరేయ్ !... ఈ మందులు తీసుకురా... ఈ ఇంజక్షన్ వెంటనే ఇయ్యాలి ఆమెకు. వెళ్లు...''అంటూ ఒక చీటీ రాసి ఇచ్చేడు.

''నేను పావుగంటలో వస్తానుసార్... మీరు ఇక్కడే వుండండి...''అన్నాడు పినాకపాణి. సరేనన్నాడు విశ్వేశ్వరరావు.

సైకిలు తీసుకుని మందులషాపుకు వెళ్లాడు పినాకపాణి.

మందు చీటీ చూపించాడు. మనసులోనే



# బ్రోచేవారెవరురా?

లెక్కకట్టి "మొత్తం మూడు రూపాయలు..." అన్నాడు షాపువాడు.

మందులు తీసుకుని జేబులోవున్న మొత్తం రెండు రూపాయలు ఇచ్చాడు.

"ఇంకో రూపాయి.." అన్నాడు షాపువాడు.

"సార్... రేపు ఇస్తాను... ఈ మందులు ఇయ్యండి.. మా అమ్మకు వంట్లో బాగోలేదు.." అన్నాడు ఆశగా.

"ఒంట్లోబాగాలేదు కనుకనే నీవు మందులు కొంటున్నావు... విడిగా చెప్పక్కర్లేదు...ఇలాంటి కథలు చాలా విన్నాం... వెళ్లి రూపాయి తీసుకొచ్చి ఇచ్చి మందులు తీసుకెళ్ళు..." బైట పెట్టిన మందులు లోపల పెట్టుకున్నాడు షాపువాడు.

ఒక నిముషం వాడివైపు చూశాడు. 'గొడ్డుటావుని పితికి లాభంలేదు...'అన్పించింది. అందుకే ఆలస్యం చెయ్యకుండా సైకిలుఎక్కి స్కూలుకి వెళ్లాడు.

శంకరం మాష్టారు ఏదో క్లాసులో పాఠం చెప్తున్నాడు. బైటకు పిలిచి – "సార్... ఒక రూపాయి ఇయ్యండి... అర్జంటు... వివరాలు తర్వాత చెప్తాను..." అన్నాడు. వాడిలోని కంగారు గమనించి ఏమీ మాట్లాడకుండా పర్సులోంచి రెండు రూపాయలు తీసి ఇచ్చారు.

వాడు ఏదో చెప్పబోతుంటే – "విడినోటు లేదు... పట్టుకెళ్లు...పర్వాలేదు..." అన్నాడు. రెండు రూపాయలు జేబులో పెట్టుకుని వేగంగా సైకిలు మీద బయలుదేరాడు మందులషాపుకి.

జంక్షన్‌లో మలుపు తిరగబోతుంటే ఒక పోలీసు అడ్డంగా నిలబడి ఆపేడు పినాకపాణిని.

ఆ పోలీసు పేరు శేషాచలం. బొద్దుమీసాలు, కుండలాంటి పొట్ట, వెడల్పు ముఖం, నల్ల రంగుతో యమదూతలాగ వున్నాడు. అతనికి పొద్దుట్నుంచీ కాఫీకికూడా డబ్బులు దొరకలేదు. అందుకని రోహిణీకార్తె సూర్యుడిలా మండి పోతున్నాడు. రాంగ్ సైడ్‌లో వస్తున్న పినాకపాణిని చూడగానే బోలెడు సంతోషం కల్గింది. ఈ కుర్రవాడిని బెదిరించి డబ్బు గుంజవచ్చని అన్పించింది. అందుకే సైకిల్ ఆపాడు.

"నువ్వు నడిపేది సైకిలా, విమానమా? అంత స్పీడెందుకురా? పైగా వన్‌వేట్రాఫిక్‌లో రూల్సుకి వ్యతిరేకంగా పోతున్నావే?" దబాయించాడు పోలీసు.

"ఇది వన్‌వేనా?" అన్నాడు ఆశ్చర్యంగా పినాకపాణి.

"అవును. నిన్నట్నుంచీ వన్‌వే చేశారు. అది తెలియక, నువ్వు రాకెట్‌లా దూసుకు పోతున్నావు..."

"తప్పేసార్... క్షమించండి... అట్నుంచి వెళ్తాను..." అంటూ సైకిల్ వెనక్కు తిప్పబోయాడు. సైకిలుమీద చెయ్యివేశాడు శేషాచలం.

"ఎక్కడికి పోతావు? ఫైను కట్టు..." అన్నాడు.

"ఫైనా?"

"అవును. తప్పుచేసి శిక్ష తప్పించుకుందామనుకుంటున్నావా?"


"ఈసారికివదిలెయ్యండి సార్...తొందరలో వున్నాను..." బ్రతిమాలేడు పినాకపాణి.

"అదేం కుదరదు. పాతిక రూపాయల ఫైను కట్టు..." కుర్రాడు కదా రూల్సు తెలియవని డబ్బు కోసం దబాయించాడు.

"డబ్బులేదు..." అన్నాడు బేలగా పాణి.

బలవంతంగా జేబులో చెయ్యిపెట్టి డబ్బు బైటకు తీశాడు. మొత్తం నాలుగు రూపాయలు ఉన్నాయి.

"అబద్ధాలు ఆడతావురా గుంటవెధవా?" అంటూ పాతిక రూపాయలు ఉంచుకుని మిగతా డబ్బు పినాకపాణి చేతిలో వుంచి "పోరా..." అన్నాడు.




"సార్... మీకు దణ్ణం పెడతాను ఆ డబ్బు ఇచ్చెయ్యండి...మందుకోసం వెళ్తున్నాను" అన్నాడు బ్రతిమాలుతూ.

"ఇప్పట్నించీ 'మందు' ఎందుకురా? ఎదవ అలవాట్లు చేసుకోకు. నేనుకూడా'మందు'కే వాడుకుంటానులే ఈ డబ్బు. తాగి చాలా రోజులయ్యింది..." అన్నాడు శేషాచలం.

"సార్... మా అమ్మ చచ్చిపోయేలా వుంది సార్..." అన్నాడు ఏడుపు ఆపుకుంటూ.

"చచ్చేవాళ్ళు మనం వద్దన్నా ఆగరురా... వెళ్ళు..." అన్నాడు శేషాచలం.

"దయ చూపండి సార్...కావలిస్తే ఒక్క రూపాయి వుంచుకోండి..."

"అంటే? నేనంత చచ్చు ఎదవలాగ కనపడుతున్నానా? పోరా... ఎదవా?" పొమ్మన్నట్టు సైగ చేశాడు.

సినాకపాణికి గుండెలు అదిరాయి. టైముకి మందు లేకపోతే తల్లి ఏమైపోతుందో!...

"సార్... ఆ డబ్బు ఇచ్చెయ్యండి... కావలిస్తే ఈ సైకిలు వుంచుకోండి..." అన్నాడు పినాకపాణి. ఆ సమయంలో అంత కంటే ఏం తోచలేదు వాడికి.

శేషాచలం కళ్లలో మెరుపు. ఈ పాతికా ఇచ్చేస్తే సైకిలు తనది అవుతుంది. ఎంతలేదన్నా నూటయాభై విలువ చేస్తుంది. తను వెంటనే అమ్మేస్తే సరి... ఆ తర్వాత వీడు వచ్చినా తనకు సైకిల్ సంగతి తెలియదని దబాయించవచ్చు.

పాతిక రూపాయలు తీసి పాణికి ఇచ్చేశాడు.

వాడి చేతిలోంచి సైకిలు లాక్కున్నాడు.

పాతిక రూపాయలు తిరిగి దొరికాయన్న ఆనందంలో సైకిలు గురించిన ఆలోచన రాలేదు పినాకపాణికి.

పోలీసువాడికి సైకిలు ఇచ్చి, మందులషాపు వైపు వేగంగా పరుగుతీశాడు.

*   *   *

తల్లి ఆరోగ్యంముందు సైకిలు విలువ వాడికి గుర్తురాలేదు.

రేపట్నుంచి తను స్కూలుకు నడిచివెళ్ళాలన్న విషయం మర్చిపోయాడు.

తల్లి గురించి ఆందోళనలో పోలీసువాడి దౌర్జన్యం గమనించలేదు.

ఆ సమయంలో పాతిక రూపాయల క్యాష్, సైకిలు విలువ కంటె ఎక్కువగా తోచింది.

అందుకే డబ్బు అందుకోగానే మందుల షాపు వైపు పరుగుతీశాడు.

శేషాచలం మాత్రం మీసాలచాటున నవ్వుకున్నాడు. పొద్దున్నే మంచి లాభసాటి బేరం దొరికిందని మురిసిపోయాడు.

పినాకపాణి లాంటి అమాయక ప్రాణుల్ని శేషాచలం లాంటి రాబందుల బారినుంచి బ్రోచేవారెవరురా???

★